బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన
జిల్లా నాయకులు

తెలంగాణభవన్‌లో కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలతో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆదివారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేయాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఆయనను పలువురు జిల్లా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పరిచయం చేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు లోక బాపురెడ్డి, దరువు ఎల్లన్న, న్యాలకొండ రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, జక్కుల నాగరాజు, కుంబాల మల్లారెడ్డి, తదితరులు

జిల్లా కేంద్రంలో జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

'మత్తు'ను నిర్మూలిద్దాం

- డ్రగ్స్‌కి నో చెబుదాం.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుదాం
- కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్
- మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 5కే రన్
- పెద్ద ఎత్తున తరలివచ్చిన యువతీయువకులు

తెలంగాణ చౌక్, మార్చి 3: దేశ భవిష్యత్ నిర్ణయించే యువత.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసకాకుండా ప్రతిఒక్కరూ నడుంబిగించాలని కలెక్టర్ అనురాగ్‌జయంతి పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 5కే రన్‌ను ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలను సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించడం మన బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చైతన్యపరిచే విధంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు 5కే రన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత మత్తుకు దూరంగా ఉంటూ.. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నియంత్రించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో డీ ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి, మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. 5కే రన్‌కు భారీ స్పందన వచ్చిందని తెలిపారు. 5కే రన్‌లో ప్రతిభ చూపిన 15మంది విజేతలకు సైకిల్ అందజేసి అభినందించారు. ఇక్కడ డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డాక్టర్లు, యువతీ యువకులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- పల్స్‌పోలియో శిబిరాలు ప్రారంభం

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

వేములవాడ/సిరిసిల్ల టౌన్, మార్చి 3: ఐదేండ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సోమ, మంగళ వారాల్లో కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలందరికీ చుక్కల మందు వేయించాలన్నారు. ఇక్కడ పల్స్‌పోలియో ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకుడు గోపాలకృష్ణ, డబ్ల్యూహెచ్‌వో కోఆర్డినేటర్ అతుల్‌నిగమే, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, ప్రోగ్రాం అధికారులు ఉమ, నయీం, జహ, సీడీపీవో అలేఖ్య, వైద్యాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

- వేములవాడ పట్టణంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ప్రారంభించారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసి మహమ్మారిని తరిమివేద్దామని కోరారు. రాజన్న ఆలయ పరిసరాల్లో ఈవో కార్యాలయం, లడ్డూ ప్రసాదం కౌంటర్ వద్ద, బస్టాండ్‌లో కూడా శిబిరాలను ఏర్పాటు చేశామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి దివ్యశ్రీ తెలిపారు. ఇక్కడ కౌన్సిలర్ సిరిగిరి రామ్‌చందర్, సూపర్‌వైజర్ ఝాన్సీమణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ముస్తాబాద్/వీర్నపల్లి/ చందుర్తి/కోనరావుపేట/ఇల్లంతకుంట/ సిరిసిల్ల రూరల్, మార్చి 3: చిన్నారుల నిండు జీవితానికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, అల్మాస్‌పూర్‌లో ఎంపీపీ పిల్లి రేణుక, దుమాలలో వైస్ఎంపీపీ కదిరె భాస్కర్, ఎల్లారెడ్డిపేటలో పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, గంభీరావుపేట మండలం గోరంటాలలో జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, వీర్నపల్లి మండలంలో పలువురు నాయకులు, చందుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ బైరగోని లావణ్య, జడ్పీటీసీ నాగం కుమార్, వైద్యాధికారి సంపత్‌కుమార్, కోనరావుపేట మండలం ధర్మారం, మల్కపేట గ్రామాల్లో మండల వైద్యాధికారి వేణు మాధవ్, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎంపీపీ పడిగెల మానస, ఇల్లంతకుంటలో వైద్యాధికారి శరణ్య, పొత్తూరులో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, అనంతారంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రజిత, వంతడుపులలో వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్‌గౌడ్, రుద్రంగి మండల కేంద్రంతోపాటు మానాలలో వైస్ ఎంపీపీ పీసరి భూమయ్య, వైద్యాధికారి సంతోష్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ విలీన గ్రామాల్లో కౌన్సిలర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శిబిరాలను ప్రారంభించారు.

వేములవాడ: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

ధార్మిక, కార్మిక క్షేత్రాల అభివృద్ధే ధ్యేయం

గుడి చెరువు ప్రాంగణంలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ/వేములవాడ టౌన్, మార్చి 3: ధార్మిక, కార్మిక క్షేత్రాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, రాజన్న ఆలయ గుడిచెరువులో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాజన్న సన్నిధికి చేరుకొని ప్రభుత్వం తరుపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యాలను అభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాలను అధికారులతో చర్చించి సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇక్కడ ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రాచారి, పట్టణ సీఐ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మహా శివరాత్రి జాతరకు రావాలని ఆహ్వానం

రాజన్న క్షేత్రంలో ఈ నెల 7నుంచి మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించే మహా శివరాత్రి జాతరలో పాల్గొనాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు. ఇక్కడ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఈవో సీసీ ఎడ్ల శివ, తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

సిరిసిల్ల టౌన్, మార్చి 3: పార్లమెంట్ ఎన్నికలకు ముందే ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం పోరాటం చేస్తున్నామని ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవీ ఇచ్చి మున్నూరుకాపులను గౌరవించాలన్నారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు బండి సంజయ్, నాయకులు ఎడ్ల రవి, మహేందర్‌కుమార్, చింతపండు మహేందర్, నీలి శంకరయ్య, కల్లూరి రాజు, అగ్గి రాములు, దుమాల రవి, బండారి శ్యాం, గుర్రం శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణ, ఎర్రం మల్లయ్య, ఇప్పపూల లక్ష్మణ్, బత్తుల భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కట్టమైసమ్మ వేడుకలు

ముస్తాబాద్, మార్చి 3: మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న పులిచెరుకుంట కట్ట మైసమ్మ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. పుట్టకు ధనిపోయడం, అమ్మవారికి బోనాలు సమర్పించడం, ఒడిబియ్యం పోయడం, గావుపట్టే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతర భక్తులకు అన్నదానం చేశారు. చివరిరోజు జాతర మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రశాంతంగా 'గురుకులం' ఎంట్రెన్స్

ప్రభుత్వ బాలుర పాఠశాలల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తెలంగాణ చౌక్, మార్చి 3: జిల్లాలోని బీసీ గురుకులం పాఠశాలల్లో ఖాళీ సీట్ల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పరీక్షల నిర్వహణ అధికారి వెంకట్రావ్ పేర్కొన్నారు. బీసీ గురుకుల పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీ కోసం సిరిసిల్ల పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,309మంది విద్యార్థులకు 1,135మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రుద్రంగి, మార్చి 3: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆదివారం ఫేయిర్‌వెల్ డే వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, నాయకులు తర్రె మనోహర్, బైరి గంగమల్లయ్య, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, డైరెక్టర్లు నరేశ్, గంగనర్సయ్య, సురేశ్ వేడుకలకు హాజరయ్యారు.

ఫేయిర్‌వెల్ డే వేడుకలో నృత్యం చేస్తున్న చిన్నారులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రాష్ట్రస్థాయి ఓపెన్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవానికి హాజరు

చందుర్తి: అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి3: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నదని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఒకినవా స్పోర్ట్స్, కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఫోర్త్ లెవల్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేములవాడ ప్రాంత సమీపంలో స్పోర్ట్స్ అకాడమీ కోసం స్థలం ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సుదీర్ఘకాలంగా కరాటే విద్యార్థులను తయారు చేస్తున్న ఎంఏ మన్నాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి సాయికుమార్, చైర్మన్ వసంత్‌కుమార్, సీనియర్ కరాటే మాస్టర్లు మొండయ్య, పాపయ్య, రాజిరెడ్డి, గోగికారి శ్రీనివాస్, అవధూత రజినీకాంత్, అంశయ్య, విజయ్, శ్రీధర్, గంగయ్య, దేవయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

చందుర్తి, మార్చి3: చందుర్తి మండలం బండపల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పల్లె దవాఖాన, సీసీ రోడ్డు, మహిళా సమైక్య భవనానికి భూమిపూజ చేశారు. ఇక్కడ జడ్పీటీసీ నాగంకుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు ముస్కు పద్మ, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, నేతలు ముస్కు ముకుందరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతుల పరిశ్రమ పోపా

పురస్కారాలు అందుకున్న ప్రతిభావంతులతో పోపా కార్యవర్గ సభ్యులు

- సైకాలజిస్ట్, పోపా కార్యదర్శి పున్నం చందర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రతిభావంతులను తయారు చేసే పరిశ్రమగా పోపా భవిష్యత్ ప్రణాళికతో ముందుకెళ్తున్నదని ప్రముఖ సైకాలజిస్ట్, పోపా ప్రధాన కార్యదర్శి పున్నం చందర్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 18మంది పద్మశాలీ యువతకు స్థానిక పద్మశాలీ కల్యాణ మండపంలో పద్మశాలీ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పద్మశాలీ సామాజిక వర్గం నుంచి ఎంతో మంది వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగారన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారుచేసిన నల్ల పరందాములు వారసత్వంగా తీసుకుని ఆయన కుమారుడు నల్ల విజయ్, వెల్ది హరిప్రసాద్ చేనేత వస్త్ర ఉత్పత్తుల్లో ప్రతిభను చాటుతూ నేతన్నల నైపుణ్యాన్ని ఖండాంతరాలకు చాటుతున్నారని కొనియాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పవర్‌లూం పరిశ్రమలో పోల్డింగ్ యంత్రాన్ని తయారు చేసిన జక్కని హేమంత్ ఉత్తమ ప్రతిభకు నిదర్శనమన్నారు. పద్మశాలీ యువతలో స్ఫూర్తిని నింపేందుకు, వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోపా తన వంతు కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గెంట్యాల భూమేశ్, గాజుల ప్రతాప్, దూస రఘుపతి, మాజీ అధ్యక్షుడు కల్లెపల్లి అశోక్, పోపా పాలకవర్గ సభ్యులు దూస శ్రీనివాస్, వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్, గడ్డం సతీశ్, కోడం రాంప్రసాద్, కొక్కుల శ్రీనివాస్, ఆడెపు చక్రపాణి, శివప్రసాద్, ఎలగొండ ఆంజనేయులు, ఆడెపు వేణు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట, మార్చి 3: కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా (2004-05లో ఎస్సెస్సీ బ్యాచ్) సమావేశమయ్యారు. తరగతి గదుల్లో అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై రోజంతా ఉత్సహంగా గడిపారు. అలాగే బావుసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (2005-06లో పదో తరగతి) మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. పాఠాలు నేర్పిన గురువులను సత్కరించారు.

- ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1988-89లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని, రోజంతా ఆనందంగా గడిపారు.

లింగమూర్తిని ఆదుకోరూ..

- నరాల సంబంధిత వ్యాధితో అవస్థలు
- చికిత్సకు రూ.10లక్షలు అవసరమని వైద్యుల వెల్లడి
- దాతలు సాయం చేయాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

కోనరావుపేట, మార్చి3: మామిడిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన మ్యాన లింగమూర్తి పదేండ్లుగా హోటల్ నడుపుతూ కుటుంబ భారం మోస్తున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితోపాటు నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ₹4లక్షల వరకు అప్పుచేసి కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. వ్యాధి నయం కావడానికి సుమారు ₹10లక్షలు అవసరమని, రోజుకు ₹20వేల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేయాల్సిన వారు 9652684260 నంబర్‌కి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా గానీ లేదా బ్యాంకు ఖాతాలో (బ్యాంక్ ఆఫ్ బరోడా, వేములవాడ బ్రాంచ్, అకౌంట్ నంబర్ 75660100001109, ఐఎఫ్‌సీకోడ్ BARB0VJVEMU) నగదు వేసి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న లింగమూర్తి

రుద్రవరంలో దొంగల భీభత్సం

వేములవాడ రూరల్, మార్చి 3: రుద్రవరంలో ఆదివారం దొంగల భీభత్సం చేశారు. 20ఏండ్ల యువకులు ఈ చోరీకి పాల్పడినట్లు సీసీ పుటేజీలో నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవరంలో హనుమాన్, మల్లికార్జున్ ఆలయాల్లోని హుండీలను పగులగొట్టారు. అలాగే పార్వతి భారత్వ ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వినోద్ విజయం సాధించాలని..

- పెద్దగుట్టలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రార్థనలు

పెద్దగుట్ట వద్ద వినోద్‌కుమార్ ఫ్లెక్సీతో బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 3: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించాలని బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాలోని హజరత్ సయ్యద్ షాదుల్లా హుస్సేన్‌బాబా దర్గా(పెద్దగుట్ట) వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇక్కడ సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షఫి, తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి

సిరిసిల్ల, మార్చి 3: గ్రూప్-1 పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 7లోగా నేరుగా సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్‌లో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, డిగ్రీ, బీ టెక్‌లో 50శాతానికి పైగా వచ్చిన మార్కుల ఆధారంగా శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 08723-223004, 9381888746 నంబర్లను గానీ, జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

బట్టలు ఆరేస్తుండగా..

- కరెంట్‌షాక్‌తో ఒకరి మృతి

ఇల్లంతకుంట, మార్చి 3: బట్టలు ఆరేస్తుండగా కరెంట్‌షాక్ కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన రంగు రమేశ్(40) ఆదివారం ఉదయం తనఇంటి ముందు బట్టలు ఆరేసేందుకు వైరు కట్టారు. ఈ క్రమంలో ఉదయం వేళలో స్నానం చేసిన తర్వాత ఆ వైరుపై బట్టలు ఆరేసేందుకు వెళ్లాడు. ఆ వైరుకు పోలీస్‌స్టేషన్ సేఫ్టి ఫిష్నింగ్ లైన్‌కు అనుకుని పైన ఉన్న విద్యుత్ తీగలు గాలికి తగలడంతో షాక్ వచ్చి మృతి చెందాడు. సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సెస్ ద్వారా వచ్చే పరిహారం అందేలా చూస్తానని భరోసానిచ్చారు. రమేశ్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

బంధనకల్ చెరువులోకి కాళ్వేరం జలాలు

ముస్తాబాద్, మార్చి 3: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో బంధనకల్ చెరువులోకి కాళేశ్వరం జలాలు చేరుకున్నాయని జడ్పీటీసీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదివారం కాలువ ద్వారా బంధనకల్ చెరువులోకి చేరుతున్న కాళేశ్వరం జలాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ అందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు, తదితరులు ఉన్నారు.

నర్సింహులపల్లెకు చేరిన జలాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 3: తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెకు రంగనాయక సాగర్ జలాలుచేరాయి. గ్రామంలోని చిన్న చెరువు నుంచి మత్తడి దుంకి బాలమల్లుపల్లె సోమయ్య చెరువులోకి నీరు పారుతున్నాయి. ఈ సందర్భంగా నర్సింహులపల్లెలోని చెరువు మత్తడిలో రైతులు పూజలు చేశారు.